క్లుప్తంగా

మత్తు పదార్థాల నిర్మూలనపై అవగాహన



పిడుగురాళ్ల: మత్తు పదార్థాలను నిర్మూలించి ఉత్తమ సమాజాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని పిడుగురాళ్ల అంజువన్ కమిటీ అధ్యక్షుడు ఎండీ ఉస్మాన్ మెస్త్రీ అన్నారు. పట్టణంలోని చెరువుకట్ట బజార్‌లోని వాటర్ ట్యాంక్ సమీపంలోని వాకింగ్ ట్రాక్ వద్ద శనివారం మత్తు పదార్థాల నిర్మూలనపై జమాతె ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో 'మత్తు పదార్థాలను నిర్మూలిద్దాం.. ఉత్తమ సమాజాన్ని నిర్మిద్దాం' అనే జాగృతి ఉద్యమాన్ని ఈ నెల 8 నుంచి 18 వరకు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కన్వీనర్ షేక్ జానీ, హఫీజ్ మహబూబ్ రహమాన్, ఎండీ లతీఫ్, షేక్ జమాల్, షేక్ నబీ, సయ్యద్ మీరా తదితరులు పాల్గొన్నారు.

ఉచిత పశు వైద్య శిబిరం



మాచవరం: మండల కేంద్రమైన మాచవరంలో సంగం డెయిరీ, దూళిపాళ్ల వీరయ్య చౌదరి ఛారిటబుల్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. పశువులకు పలు రకాల వ్యాధులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు ఉమా మహేశ్వరరావు, ప్రదీప్, ప్రసాద్ పాల్గొన్నారు.

గిరిజన విభాగం రాష్ట్ర కార్యదర్శిగా బాణావత్



గురజాల : వైఎస్సార్‌సీపీ గిరిజన విభాగం రాష్ట్ర కార్యదర్శిగా బాణావత్ నాగేశ్వరరావు నాయక్‌ను నియమిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ సందర్భంగా నాగేశ్వరరావు నాయక్ మాట్లాడుతూ గిరిజనుల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. తనకు పదవి రావడానికి సహకరించిన ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

బీసీ గర్జన పోస్టరు ఆవిష్కరణ



పిడుగురాళ్ల: పట్టణంలోని బీసీ సంక్షేమ సంఘ కార్యాలయంలో సంఘ అధ్యక్షుడు యడవల్లి కొండలు గౌడ్ అధ్యక్షతన బీసీ గర్జన బహిరంగ వాల్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం శనివారం జరిగింది. ఈ సందర్భంగా నియోజకవర్గ అధ్యక్షుడు కొక్కెర కొండలు యాదవ్, పట్టణ ప్రధాన కార్యదర్శి దూదేకుల కాశీం సైదా, గౌరవ అధ్యక్షుడు బీసీ స్వామి, జిల్లా కార్యదర్శి చింతల అజేయ్ కుమార్ యాదవ్‌లు మాట్లాడారు. ఈ నెల 25న జరగబోయే బీసీ గర్జన భారీ బహిరంగ సభకు నియోజకవర్గంలోని బీసీ సోదరులు రాజకీయ పార్టీలకు అతీతంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై సమీక్ష



మాచర్ల రూరల్: రానున్న సార్వత్రిక ఎన్నికలలో అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని తహసీల్దార్ మంజునాథరెడ్డి కోరారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజక వర్గంలో ఉన్న 299 పోలింగ్ స్టేషన్‌లలో అవసరమైన మౌలిక సదుపాయాలను ఆయా కేంద్రాలలో కల్పించేందుకు పనిచేయాలన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడీఏ జగదీశ్వరరెడ్డి, ఎంఈఓ అల్లి సురేష్, వివిధ శాఖాధికారులు పాల్గొన్నారు.

కారు ఢీకొని ఉపాధ్యాయుడికి గాయాలు

నాదెండ్ల: బైక్‌ను కారు ఢీకొని ఓ ఉపాధ్యాయుడు గాయపడిన సంఘటన జాతీయ రహదారి గణపవరం ప్రసన్నవంశీ స్పిన్నింగ్ మిల్లు సమీపంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. యడ్లపాడు మండలం, మైదవోలుకు చెందిన నక్కా శ్రీనివాసరావు ఓ స్కూల్లో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పని చేస్తుంటాడు. తన ద్విచక్రవాహనంతో చిలకలూరిపేట వెళ్తుండగా, ప్రసన్నవంశీ స్పిన్నింగ్ మిల్లు వద్దకు రాగానే యూటర్న్ తీసుకుంటుండగా, చిలకలూరిపేట నుంచి గుంటూరు వైపు వెళ్తున్న కారు ఢీకొంది. దీంతో ఉపాధ్యాయుడికి గాయాలయ్యాయి.

అభివృద్ధి కాంతులు.. అద్దంలా మారిన రహదారులు

- పెదగార్లపాడులో రూ.50 కోట్ల మేర అభివృద్ధి పనులు
- వైఎస్సార్‌సీపీ పాలనలో ఊరంతా సీసీ రోడ్లు
- ఇంటింటికీ తాగునీరు సరఫరాతో గట్టెక్కిన తాగునీటి కష్టాలు
- గ్రామం అభివృద్ధితో జనం హర్షాతిరేకాలు



పెదగార్లపాడులో నిర్మించిన గ్రామ సచివాలయం





అద్దంలా మారిన సిమెంట్ రహదారి

దాచేపల్లి : ప్రభుత్వ సంకల్పం.. పాలకుల కార్యదీక్ష..వెరసి దాచేపల్లి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించాయి. పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా ఈ గ్రామం గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధిలో బాగా వెనుకబడింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామ రూపు రేఖలు మారిపోయాయి. దాచేపల్లి మండలం పెదగార్లపాడు గ్రామంలో అభివృద్ధి పరవళ్లు తొక్కింది. నవరత్న పథకాలతో పాటుగా అభివృద్ధి పనులు ఇక్కడ శరవేగంగా జరిగాయి. ఊరంతా సిమెంట్ రోడ్లు వేశారు. ఇంటి వద్దకు నీటిని ఇచ్చేలా చర్యలు తీసుకున్నారు. గ్రామంలో ఉన్న దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారం కావటంతో మళ్లీ వైఎస్సార్‌సీపీని అధికారంలోకి తెస్తామని ఈ గ్రామస్తులు ముక్తకంఠంతో చెబుతున్నారు.

గ్రామస్తులకు రూ.50 కోట్ల లబ్ధి

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఈ గ్రామానికి రూ.50 కోట్ల మేర లబ్ధి చేకూరింది. ఇంతటి భారీ స్థాయిలో గ్రామస్తులకు లబ్ధి జరగటం ఇదే మొదటిసారి. డీబీటీ ద్వారా రూ.22.12 కోట్లు, నాన్ డీబీటీ ద్వారా రూ.28 కోట్ల మేర లబ్ధి జరిగింది.

ఊరంతా సిమెంట్ రహదారులు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత గ్రామాభివృద్ధిపై స్థానిక ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. గ్రామ జనాభా 6,500 మంది ఉండగా 4,125 మంది ఓటర్లు ఉన్నారు. రూ 1.20 కోట్లతో గ్రామం మొత్తం సిమెంట్ రోడ్లు నిర్మించారు. గ్రామంలో మట్టి రోడ్డు ఉన్నది అని చెప్పుకోవటానికి లేకుండా సిమెంట్ రోడ్లు వేశారు. రూ 1.50 కోట్లతో డ్రైనేజీలు నిర్మించారు. రూ.70 లక్షల నిధులతో పొలాల బాటలను అభివృద్ధి చేశారు. రూ.2.13కోట్ల విలువైన భూమిలో 285 మంది నిరుపేదలకు ఇంటి పట్టాలను ఇచ్చారు. రూ.42 లక్షలతో గ్రామ సచివాలయం, రూ.32 లక్షలతో వైఎస్సార్ హెల్త్‌క్లినిక్, రూ.16 లక్షలతో రైతుభరోసా కేంద్రం భవనాల నిర్మాణం చేపట్టారు. రూ.1.08 కోట్లతో కొళాయిల ద్వారా ఇంటింటికీ తాగునీరు అందించేలా పైపులైన్ పనులు చేపట్టారు. నాడు–నేడు ద్వారా రూ1.10 కోట్లతో ప్రభుత్వ పాఠశాలల ఆధునికీకరణ పనులు చేశారు. రూ.3.50 కోట్లతో తక్కెళ్లపాడు నుంచి పెదగార్లపాడు వరకు తారురోడ్డు నిర్మాణం చేపట్టారు. ముస్లింల కోసం షాదీఖానా, ఈద్గా నిర్మాణాలు చేపట్టారు. ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి చొరవతో గ్రామం అభివృద్ధిలో పరవళ్లు తొక్కింది.

జనం మెచ్చేలా అభివృద్ధి



పెదగార్లపాడు చరిత్రలో మునుపెన్నడూ జరగనంత సంక్షేమం, అభివృద్ధి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చేసి చూపించాం. ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ప్రత్యేక చొరవతో అభివృద్ధి పనులు శరవేగంగా సాగాయి. ప్రభుత్వ పాలనలో ఊరంతా సిమెంట్ రోడ్లు వేసి డ్రైనేజీలు నిర్మించాం. ఎక్కడ సమస్య వచ్చినా తక్షణమే స్పందించి పరిష్కరించాం. సీఎం జగనన్న చేతుల మీదుగా రూ.50 కోట్ల మేర లబ్ధి ప్రతి ఇంటికి జరిగింది. జనం మెచ్చుకునేలా సంక్షేమం, అభివృద్ధి చేసి చూపించాం.

– కర్పూరపు వెంకటకోటయ్య, సర్పంచ్, పెదగార్లపాడు.

ఇంటికే తాగునీరు అందిస్తున్నారు



ఎస్సీ కాలనీలో దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలు పరిష్కరించారు. సిమెంట్ రోడ్లు వేసి డ్రైనేజీలు నిర్మించారు. ఇంటింటికీ తాగునీరు అందిస్తున్నారు. మా కాలనీలో అర్హులైన నిరుపేదలకు ఇంటి స్థలాలు ఇచ్చారు. నవరత్న పథకాలు ప్రతి ఇంటికీ అందాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మా కాలనీని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి అండగా నిలిచారు.

– బైరపోగు కోటేశ్వరరావు, ఎస్సీ కాలనీవాసి.

గ్రామంలోనే ప్రభుత్వ సేవలు పొందుతున్నాం



గత ప్రభుత్వాలలో ఏ పని కావాలన్నా దాచేపల్లికి వెళ్లేవాళ్లం. దాచేపల్లి నుంచి మా గ్రామానికి వచ్చే మట్టి రోడ్డును రూ.3.50 కోట్లతో తారురోడ్డుగా మార్చారు. సచివాలయం మా గ్రామంలోనే ఉండటం వలన సేవలన్నీ ఇక్కడే పొందుతున్నాం.

– షేక్ మాబు, గ్రామస్తుడు.

గురజాల నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ మండల, నగర పంచాయతీ కమిటీ సభ్యుల నియామకం

ఖరారు చేసిన కేంద్ర పార్టీ కార్యాలయం

నరసరావుపేట: గురజాల నియోజకవర్గంలోని మండల, నగర పంచాయతీలకు చెందిన వైఎస్సార్‌సీపీ కమిటీలను పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు శనివారం కేంద్ర పార్టీ కార్యాలయం ప్రకటించింది.

దాచేపల్లి నగర పంచాయతీ పార్టీ కమిటీ

అధ్యక్షులుగా షేక్‌మహబూబు సుభాని, ప్రధాన కార్యదర్శులుగా కోలా జంపాలరెడ్డి, బండ్లయాకోబు, అఫీషియల్ స్పోక్ పర్సన్లుగా కొమ్ము బుజ్జి, వట్టెం నరేంద్ర, కొమెరబత్తిన ఆనంద్, కార్యదర్శులుగా షేక్ అబ్దుల్ మునాఫ్, కోలా శ్రీనివాసరెడ్డి, గద్దల కిరణ్, కోశాధికారిగా గుంజి వెంకటరావు, సంయుక్త కార్యదర్శులుగా సంకుత్రి వెంకటేశ్వర్లు, కొమ్ము కరుణాకర్, నట్టువ నాగేశ్వరరావు, బొల్లంపల్లి మరియదాసు, షేక్ నాగూల్‌మీరా, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా షేక్ నాగూల్‌మీరా, గరికపాటి సైదారావు, నాగరాజు, మునియం శ్రీను, చల్లా లింగయ్య, జగన్నాథం దావీదులను నియమించారు.

దాచేపల్లి మండల పార్టీ కమిటీ

అధ్యక్షులుగా కోటా కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా పరిమి బాబు, అఫీషియల్ స్పోక్ పర్సన్లుగా ముత్యం చెన్నారెడ్డి, చింతల దానియేలు, కార్యదర్శులుగా గూడూరు వీరాస్వామి, జరపరాల చినకోటయ్య, సంయుక్త కార్యదర్శులుగా షేక్ ఇమామ్‌వలి, బాసిపోగు రాంబాబు, షేక్ ఆదంసాహెబ్, కోశాధికారిగా అనగోతు రంగనాయక్, ఎగ్జిక్యూటీవ్ మెంబర్లుగా వినుకొండ మాణిక్యరావు, బొడ్డు నరసింహారావు, కామిరెడ్డి రామిరెడ్డి, ఐలాపురం నరసింహారావు, బాలరాజు నరసరాజులు నియమితులయ్యారు.

గురజాల మండల పార్టీ కమిటీ

అధ్యక్షులుగా సిద్దప్ప గాంధీ, ప్రధాన కార్యదర్శిగా బండ్ల సాంబశివరావు, అఫీషియల్ స్పోక్ పర్సన్లుగా షేక్ పీర్‌అహ్మద్, పేరం శేఖరరెడ్డి, కార్యదర్శులుగా సోమా వెంకటరావు, బాణావత్ నాగరాజు నాయక్, కోశాధికారిగా వెన్నా శ్రీనివాసరెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా బాతుల చంద్రం, కటికల అక్కులు, మోరసాని రామిరెడ్డి, ఎగ్జిక్యూటీవ్ మెంబర్లుగా దేవరశెట్టి గురువులు, బందలపాటి బ్రహ్మేశ్వరరావు, రాయపాటి ప్రసాదు, బొడ్డపాటి రామాంజిరెడ్డి, ఢీకొండ నరేష్‌లు నియమితులయ్యారు.

గురజాల నగర పంచాయతీ కమిటీ

అధ్యక్షులుగా కుక్కముడి అన్నారావు, ప్రధాన కార్యదర్శులుగా తిపులూరి కోటిరెడ్డి, యక్కలూరి రంగనాయుడు, అఫీషియల్ స్పోక్‌పర్సన్లుగా కనకం ఆదినారాయణ, చవ్వా శౌరెడ్డి, కార్యదర్శులుగా కర్రా గిరిబాబు, గంధం చంద్రయ్య, షేక్ జానిబాష, పోలా సతీష్, సంయుక్త కార్యదర్శులుగా మంచి కాటంరాజు, నారాయణపురం రవికుమార్, బండి సుబ్రమణ్యం, గొల్లా లింగయ్య, యడ్లపల్లి శ్రీనివాసరావు, ఎగ్జిక్యూటీవ్ మెంబర్లుగా నీలం అంజిబాబు, దేవేండ్ల అశోక్, చప్పల పెద వెంకటరామయ్య, షేక్ మస్తాన్‌వలి, రాచకొండ శ్రీనివాసాచారి, పురం శ్రీనివాసరావు నియమితులయ్యారు.

పిడుగురాళ్ల మున్సిపల్ పార్టీ కమిటీ

అధ్యక్షులుగా చింతా వెంకటరమణారావు, ప్రధాన కార్యదర్శులుగా దేవరశెట్టి సురేష్, ఒప్పిచర్ల శ్రీనివాసాచారి, అఫీషియల్ స్పోక్‌పర్సన్లుగా గాదే అనంతరామిరెడ్డి, షేక్ సైదా, కార్యదర్శులుగా కొంద్రకుంట శివాజీ, కొట బుచ్చిబాబు, మల్లిఖార్జునరావు, కోశాధికారిగా కొప్పుల రామకృష్ణారెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా యర్రం సామేలు, షేక్ షాధిక్, కోట రమేష్, షేక్ అబ్బాస్, గుండా రమేష్, ఎగ్జిక్యూటీవ్ మెంబర్లుగా షేక్ బాష, మర్రిబోయిన సాంబయ్య, గుంతగని రమేష్, బత్తుల వెంకటేష్, చిలకల వెంకటేశ్వర్లు, పసుపులేటి అశోక్ నియమితులయ్యారు.

పిడుగురాళ్ల మండల పార్టీ కమిటీ

అధ్యక్షులుగా చల్లా పిచ్చిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఉన్నం శ్రీనివాసరావు, అఫీషియల్ స్పోక్‌పర్సన్లుగా లింగాల వెంకటకోటయ్య,గరికపాటి అంజిరెడ్డి, కార్యదర్శులుగా దీకల ఏసుపాదం, నారాబోయిన శ్రీనివాసరావు, కోశాధికారిగా కావూరి రామాంజనేయులు, సంయుక్త కార్యదర్శులుగా రావూరి పున్నారెడ్డి, మేకల శ్రీనివాసరావు, బుర్రి సత్యనారాయణరెడ్డి, ఎగ్జిక్యూటీవ్ మెంబర్లుగా పాదర్తి అనీల్‌కుమార్, పండితి నరిసిరెడ్డి, యర్రంరెడ్డి భాస్కరరెడ్డి, పుణ్యాల వీరారెడ్డి, షేక్ సుభాని నియమితులయ్యారు.

మాచవరం మండల పార్టీ కమిటీ

అధ్యక్షులుగా చౌదరి సింగరయ్య, ప్రధాన కార్యదర్శిగా దారం లక్ష్మిరెడ్డి, అఫీషియల్ స్పోక్‌పర్సన్లుగా చింతపల్లి పెద్దసైదా, చింతారెడ్డి పుల్లారెడ్డి, కార్యదర్శులుగా గుమ్మా హుస్సేనయ్య, తండా కాసులు, కోశాధికారిగా సింగదల ముక్కంటి, సంయుక్త కార్యదర్శులుగా యామిని హనుమంతరావు, షేక్ దస్తగిరి, అన్నంగి వెంకటేశ్వర్లు, ఎగ్జిక్యూటీవ్ మెంబర్లుగా ముడావత్ బాబూనాయక్, చల్లగుండ్ల రాంబాబు, మూలగుండ్ల ప్రతాప్‌రెడ్డి, వట్టే రామిరెడ్డి, బూతుకూరి రమణారెడ్డి నియమితులయ్యారు.

బంజారాల ఆరాధ్యుడు సంత్ సేవాలాల్



మాట్లాడుతున్న తెలంగాణ రాష్ట్ర దీక్ష గురువు భోజు మహరాజ్

విజయపురిసౌత్: బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్ అని తెలంగాణ రాష్ట్ర దీక్ష గురువు భోజు మహరాజ్ అన్నారు. శనివారం విజయపురి సౌత్‌లోని సేవాలాల్ మహరాజ్ ఆలయంలో జరిగిన సేవలాల్ 285వ జయంతి ముగింపు వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బంజారాల హక్కుల కోసం 18వ శతాబ్దంలో సాగిన పోరాటంలో సంత్ సేవాలాల్ కీలక భూమిక పోషించారని చెప్పారు. మానవాళికి ధర్మమార్గాన్ని అలవాటు చేసేందుకు సంత్ సేవాలాల్ మహరాజ్ విశేష కృషి చేశారని తెలిపారు. సేవలాల్ బోధనలతో బంజారాలు సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోగలిగారని చెప్పారు. అనంతరం ఆలయ ధర్మకర్త కె.పాండు నాయక్ ఆధ్వర్యంలో భోజు మహరాజ్‌ను ఘనంగా సత్కరించారు. మధ్యాహ్నం వెయ్యి మంది భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మిర్యాలగూడకు చెందిన అపోలో రిచ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పేదలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఆలయ ప్రాంగణంలో ఎత్తిపోతల ఆశ్రమ బాలికల పాఠశాల విద్యార్థినిలు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మేరాజ్యోత్ హనుమంత్ నాయక్, హైదరాబాద్ సేవాలాల్ మహరాజ్ పీఠాధిపతి లచ్చా సాద, అర్చకుడు సభవత్ శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో మైనార్టీలకు సముచిత స్థానం

ప్రభుత్వ విప్ పీఆర్కే



యువజన విభాగం కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న పీఆర్కే

మాచర్ల: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ మైనార్టీలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తుందని పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం రామా టాకీస్ లైన్‌లోని వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడు షేక్ మస్తాన్ ఆధ్వర్యంలో కార్యాలయాన్ని ప్రారంభించి మాట్లాడారు. మైనార్టీల విషయంలో ఏనాడూ వైఎస్సార్‌సీపీ రాజీ పడలేదని ప్రభుత్వ విప్ పీఆర్కే అన్నారు. కొంత మంది కావాలని దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. మైనార్టీలంతా సీఎం జగన్‌కు అండగా ఉండాలన్నారు. ఇప్పటికే కోట్ల రూపాయల నిధులను మైనార్టీల అభివృద్ధి కోసం ఖర్చు చేసినట్లు వివరించారు. రాబోయే రోజుల్లోనూ మైనార్టీలకు ప్రాధాన్యతను ఇస్తామన్నారు. మాచర్ల పట్టణ యువజన విభాగ అధ్యక్షుడుగా షేక్ మస్తాన్‌ను నియమించటం జరిగిందన్నారు. పార్టీ కార్యాలయ ప్రారంభ కార్యక్రమంలో షేక్ మస్తాన్, సీలింగ్ బాషా, దరియా, అంగార్ బాషా, షేక్ సులేమాన్, రహమాన్, షేక్ అల్లావుద్దీన్, అబ్దుల్ జలీల్, సుభాని, వందలాది మైనార్టీ నాయకులు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

సీఎం జగన్, పీఆర్కేల వెంటే ఉంటాం

- స్పష్టం చేసిన వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకులు
- కౌన్సిలర్ షేక్ మదార్‌సాహెబ్ వ్యాఖ్యలపై మండిపాటు
- పదవికి రాజీనామా చేసి గెలవాలని సవాల్



సమావేశంలో మాట్లాడుతున్న మైనార్టీ నాయకులు

మాచర్ల: మైనార్టీల అభివృద్ధి కోసం వైఎస్సార్‌సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షులు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి రూ.4 కోట్లకు పైగా నిధులు కేటాయించి వారి అభివృద్ధికి కృషి చేశారని రాష్ట్ర బ్యూటిఫికేషన్ డైరెక్టర్ ఉప్పలపాటి జాని, మాచర్ల నియోజక వర్గ జేసీఎస్ కన్వీనర్ షేక్ కరిముల్లా, మున్సిపల్ మాజీ వైర్మన్ అబ్దుల్ జలీల్, 28వ వార్డు కౌన్సిలర్ షేక్ మస్తాన్‌లు అన్నారు. శనివారం వైఎస్సార్‌సీపీ క్యాంపు కార్యాలయంలో మైనార్టీ సీనియర్ నేతలు, పలువురు కౌన్సిలర్లు సమావేశం నిర్వహించారు. మైనార్టీల అభ్యున్నతి కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విశేష కృషి చేస్తూ వారికి ఉన్నత స్థానాలను కల్పించారన్నారు. వారి బాటలోనే ప్రభుత్వ విప్ పీఆర్కే పదేళ్లుగా మైనార్టీలకు ప్రాధాన్యతనిస్తూ సొంత నిధులు వెచ్చించి ఈద్గా నిర్మాణం చేశారన్నారు. పలు మసీదుల అభివృద్ధితో పాటు కమ్యూనిటీ హాళ్లకు కోట్ల రూపాయలు కేటాయించారన్నారు. వీటన్నింటిపై అవగాహన లేకుండా ఎన్నికలొచ్చిన సమయంలో పార్టీ మారే కౌన్సిలర్ షేక్ మదార్‌సాహెబ్ వైఎస్సార్‌సీపీపై ఆరోపణలు చేయటంపై వారు తీవ్రంగా ఖండించారు. తామంతా మైనార్టీల అభివృద్ధి కోసం కృషి చేసిన సీఎం జగన్, పీఆర్కేలకు అండగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. వైఎస్సార్‌సీపీ ద్వారా కౌన్సిలర్‌గా ఎన్నికైన పదవికి రాజీనామా చేసి మళ్లీ గెలవాలని మదార్‌సాహెబ్‌కి సవాల్ విసిరారు. సమావేశంలో 2వ వార్డు కౌన్సిలర్ షేక్ నాగుల్ మీరా, 26వ వార్డు కౌన్సిలర్ షేక్ దస్తగిరి, 29వ వార్డు కౌన్సిలర్ షేక్ సుభాని, కో ఆప్షన్ మెంబర్లు షేక్ యాసిన్, అంగార్ బాషా, వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకులు షేక్ గులాం హుస్సేన్, షేక్ సులేమాన్‌పాషా, ట్రాక్టర్ కరిముల్లాతో పాటు పలువురు మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరికలు

- టీడీపీ మాజీ కౌన్సిలర్ షేక్ రషీద్‌తో పాటు పలువురు మైనార్టీ నాయకులు
- సాదరంగా ఆహ్వానించిన ప్రభుత్వ విప్ పీఆర్కే



వైఎస్సార్‌సీపీలోకి చేరిన మైనార్టీ నాయకులతో ప్రభుత్వ విప్ పీఆర్కే

మాచర్ల: సీఎం జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై టీడీపీ మాజీ కౌన్సిలర్ షేక్ రషీద్‌తో పాటు పలువురు మైనార్టీ నాయకులు పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో శనివారం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వీరందరినీ ప్రభుత్వ విప్ పీఆర్కే సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ ప్రాధాన్యత నిచ్చి రాబోయే రోజుల్లో సముచిత స్థానం కల్పిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన ఏసోబు, వెల్దుర్తి మండల పరిషత్ ఉపాధ్యక్షుడు అలుగుమల్లి సంజీవరెడ్డి, పట్టణానికి చెందిన పలువురు నాయకులు పాల్గొన్నారు.

జూన్‌లో చిలకలూరిపేటలో జాతీయ స్థాయి చౌక్‌బాల్ పోటీలు

చిలకలూరిపేటటౌన్: ఏపీ చౌక్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చిలకలూరిపేటలో జూన్ నెలలో జాతీయ స్థాయి చౌక్‌బాల్ పోటీల నిర్వహణకు అనుమతి కోసం చౌక్‌బాల్ ఇండియాకు దరఖాస్తు చేశామని అసోసియేషన్ చైర్మన్, కార్యదర్శి చేబ్రోలు మహేష్, ఎస్ సుధాకర్ తెలిపారు. ఈ జాతీయ స్థాయి పోటీల్లో దేశ నలుమూలల నుంచి 28 రాష్ట్రాల టీంలు పాల్గొననున్నట్లు చెప్పారు.

మట్టమల్లి జీవితం ఆదర్శనీయం



మట్టమల్లి విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

రెంటచింతల: రెంటచింతల గ్రామానికి చెందిన స్వాతంత్ర్య సమర యోధుడు నాళం మట్టమల్లి జీవితం ఆదర్శనీయమని మాచర్ల రామకృష్ణ సేవామండలి అధ్యక్షులు మెట్టు గోవిందురెడ్డి అన్నారు. శనివారం నాళం మట్టమల్లి 63వ వర్ధంతి సందర్భంగా స్థానిక రామాలయం సెంటర్లో ఉన్న ఆయన విగ్రహానికి యన పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వాసవి అమ్మవారి దేవస్థానం చైర్మన్ కట్టమూరి వెంకట నాగేశ్వరరావు, దుర్గి మార్కెట్ యార్డు డైరెక్టర్ కొక్కొండ్ల బ్రహ్మం, నాళం పెద బాబు, ఎల్ఐసి డీవో భిక్షాలు, నాళం చినబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు వలంటీర్లకు సన్మానం

దాచేపల్లి : స్థానిక షాదీఖానాలో వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ కొప్పుల సుబ్బమ్మ, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ షేక్ సుభానీ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. షాదీఖానాలో జరిగే ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని వలంటీర్లను సన్మానిస్తారని చెప్పారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని సూచించారు.

నేటి నుంచి నరసింహస్వామి కల్యాణోత్సవాలు

మాచవరం: మండలంలోని మోర్జంపాడు గ్రామంలో వేంచేసి యున్న శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి 68వ కల్యాణ మహోత్సవాలను నేటి నుంచి నిర్వహించనున్నట్లు నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు. నేడు స్వామివారి ఫొంజు సేవ, సోమవారం కల్యాణం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు కల్యాణ మహోత్సవం సందర్భంగా గ్రామంలో ఈ నెల 20 నుంచి జాతీయ స్థాయి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామ రైతు సంఘ కమిటీ సభ్యులు వెల్లడించారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ

విజయపురిసౌత్ : స్థానిక ఆదరణ మానవ సేవా సమితి ఆధ్వర్యంలో మాచర్ల మండలం బోధనంపాడు చెంచుకాలనీలో పేదలకు శనివారం దుప్పట్లు పంపిణీ చేశారు. సమితి అధ్యక్షుడు పలుకూరి జోసెఫ్ బాబు మాట్లాడుతూ నిరుపేదల కోసం ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పసువేముల సర్పంచ్ దేవదానం, ఏపీఆర్జేసీ అధ్యాపకులు పి.సుబ్బారెడ్డి, గంటా సత్యనారాయణ, రామయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

వెల్దుర్తి: వేగంగా వెళ్తున్న ఆటో బోల్తా కొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని గుండ్లపాడు, కండ్లకుంట గ్రామాల మధ్య శనివారం జరిగింది. గుండ్లపాడు గ్రామానికి చెందిన కంభంపాటి చిన ఏసోబు (45) గేదెల వ్యాపారం నిమిత్తం కండ్లకుంట గ్రామానికి వెళ్లి స్వగ్రామానికి ఆటో ఎక్కి తిరిగి వస్తుండగా ఆటో బోల్తా పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు చిన ఏసోబుకు భార్య, పిల్లలు న్నారు. భార్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ శ్రీహరి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మాచర్ల ప్రభుత్వాసుపత్రికి పంపినట్లు తెలిపారు.

ఆలయంలో చోరీ

రెంటచింతల : మండలంలో సుబ్బయ్యపాలెం గ్రామంలో గల కోదండరామస్వామి ఆలయంలో చోరీ జరిగిన సంఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. శుక్రవారం అర్ధరాత్రి ఈ సంఘటన జరిగి ఉండవచ్చునని గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలో గల శ్రీ కోదండరామస్వామి ఆలయంలోకి వెళ్ళిన గ్రామస్తులకు హుండీ కనబడకపోవటంతో చోరీ జరిగిందని గుర్తించారు. గుర్తుతెలియని వ్యక్తులు గుడిలో ఉన్న హుండీని తీసుకెళ్లిన విషయాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సమాచారము తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు ప్రారంభించారు.

